# క్షమించు తల్లీ!

అంధకారి మహోదయులు బిలో పోవర్టీలైన్‌కి చెందినవారు కాకపోయినా బిపిఎల్‌కి కొద్దిగా మీదనున్న కుటుంబీకులు. తన కంటే ఉన్నత స్థాయిలో వున్న జలజనయనంగారి పక్కవాటాలో అద్దెకు దిగేరు. దిగిన మర్నాడే కొళాయి దగ్గర పేచీ. తెల్లవారే సరికి దగ్గుతూ దగ్గుతూ, కొళాయి విప్పేరు అని సూచనను గ్రహించిన అంధకారి గారి ఇల్లాలు, బిందె పట్టుకుని నీళ్ల పట్టుకోడానికి రెడీ అయింది.

"ముందు మేం పట్టుకోందే మీరు పట్టుకోకూడదమ్మా!" అని అడ్డగించింది జలజనయనంగారి ఇల్లాలు.

కొందరు యజమానురాళ్ల అయితే, తాము ఇంతకుముందుఎదుర్కొన్న వేపాకు అనుభవాలను, తాము సొంత ఇంటి యజమానులవగానే మరచిపోతారు. అహం పెరుగుతుంది.

"సరే అలాగే వదినగారూ! ఇంకామీరు లేవలేదు కదా అని బిందె పెట్టబోయేను" అని తను పెట్టిన బిందెను వెనక్కు తీసేను కుంది అంధకారి గారి ఇల్లాలు.

అంధకారిగారు పాత ఇంట్లో పనిచేసిన పనిమనిషి, కొత్త ఇంట్లో అంట్లు తోమడానికి వచ్చింది. దానిక్కూడా అడ్డుకుంది ఇంటి యజమానురాలు. "మా పనిమనిషి మీపనిమనిషీ ఒక్కరే అవాలి. మీ పనిమనిషి ఇక్కడ పని చేయడం వల్ల కాదమ్మా!" అంది ఇంటి యజమానురాలు.

అంధకారి గారి ఇల్లాలుబాధాకరంగా అందుక్కూడా ఒప్పుకుంది. పాత పనిమనిషి చేతిలో ఓ యాభైరూపాయలు పెట్టి "మరో పని చూసుకో అప్పాయమ్మా!" దీనంగా అంది.

ఇలాంటి ఈసడింపులు అద్దె ఇళ్లలో ఉన్న వారికి మామూలే! వందకోట్ల జనాభాకీ అందరికీ సొంత ఇళ్లు ఎలావుంటాయి?

⊗⊗⊗

మరో ఆర్నెల్లలో ఇంటి యజమాని జలజనయనం గారింటికి.. వాళ్ల అమ్మాయి జగన్మాతను చూడ్డానికి ఓ పెళ్లి వారొచ్చారు.

మగపెళ్లివారు ఆటో దిగుతూ, ఆటోమేటిక్గ్గా జలజనయనం గారి పక్కవాటా గోడమీద, ' అంధకారి' అన్న చిన్న నేమ్‌బోర్డుచూసేరు.

అంధకారిగారు ఆటో చప్పుడు విని "ఎవరు చెప్మావచ్చేరు?" అను కుంటూ వీధిలోకి వచ్చేరు. ఆ మగపెళ్లివారు తనకు చిరపరిచితులే!

"ఏమిటి అంధకారి గారూ! మీరు ఈ వాటాలోనే ఉంటు న్నారా?" అని పలకరించేరు పెళ్లికొడుకు తండ్రి.

"అవునండీ! అర్నెల్లయింది" అన్నారు అంధకారి గారు.

"ఉండండి. పెళ్లి చూపులయేక మిమ్మల్ని కలుస్తాను".

"అలాగే తప్పకుండా"

ఈ సంభాషణలు విన్న జలజనయనం దంపతులకు గుండెల్లో బండరాళ్లు పడ్డా. గుండెలమీద కుంపటిగా ఉన్న సుపుత్రిక జగన్మాతను ఎలా దింపుకుందామా అని అలోచిస్తూంటే ఇదోబాధా? తాము కొళాయినీళ్లు ముందుగా పట్టుకోకుండా అడ్డుకున్నారు. మీ పనిమనిషీ మా పనిమనిషీ ఒక్కర్తే అవాలని పట్టుబట్టేరు. అందుకు వాళ్లు ఒప్పుకున్నా, మనసులో అక్కసు ఎక్కడకు పోతుంది? ఆ కక్ష కొద్దీ ఈ సంబంధం చెడగొడతారేమో?

ఫలాలు తింటేనే ఫలహారం అనాలి. కాని మనవాళ్లు దిబ్బరొట్టే, ఉప్పుపిండి లాగించేసినా ఫలహారాలంటూ ఉంటారు. కాఫీ టిఫిన్లు అంటేనే భేషుగ్గా ఉంటుంది.

కాఫీ టిఫిన్లు, పెళ్లిచూపులు అయేక.. "సరే ఏ విషయం ఓ నెల్లాళ్లలో చెప్తాం" అని మగపెళ్లి వారు లేచి, అంధకారి వాటాలో దూరేరు. అంధకారిగారు తలుపు దభేల్‌మని వేసేరు. జలజనయనంగారి గుండె 'గుభేల్' మంది.

అంధకారిగారు మగపెళ్లివారితో ఏం మాట్లాడుతున్నారో విందామని 'గోడకు చెవులుంటాయి' అనే సామెతను అమలుపరిచేరు జలజనయనంగారు. ఊహు! ఒక్కమాట వినబడితేనా?

మగపెళ్లివారు వెళ్లిపోయారు. మరో వారానికే జలజనయనం గారికి ఉత్తరం వచ్చింది.

"అయ్యా! జలజనయనం గారూ! మీ అమ్మాయిని వారం కిందట మేము చూసిన తరువాత, మీ పక్కవాటాలో ఉన్న మా స్నేహితుల్ని మీ గురించి అన్ని విషయాలూ అడిగి తెలుసుకున్నాం....."

"చూసేవుటే! పక్కవాటా వాళ్ళని మన గురించి అడిగితే వెధవలు మనక నుకూలంగా ఎలాచెప్తారు? చెడపడానికి చేట పెయ్యిచాలు" అన్నారు జలజనయనంగారు.

"తర్వాత ఏం రాసేరో చదవండీ!" అంది జలజనయనం గారు ఇల్లాలు.

"ఆ చదువుతున్నాను, మీరు దుష్టులూ, దుర్మార్గులూ, కుచ్చితపు బుద్ధికలవారు.

"చూసేవా చూసేవా! కొరకంచుని పొయ్యిలో పెట్టకుండా చూరులో పెట్టుకున్నాం-

అది మన కొంప కాలుస్తుంది కాని ఊరుకుంటుందా? అన్నారు జలజనయనంగారు ఆపి.

"అబ్బా! పూర్తిగా చదవండి మధ్యలో ఏమిటీ దిక్కుమాలిన సంత?"

"మీరు దుష్టులూ, దుర్మార్గులు అసూయాపరులూ, కుచ్చితపు బుద్ధికలవారూ.... కారని, మీ ప్రక్క వాళ్లు చెప్పేరు. మీ అమ్మాయి జగన్మాత మాకు మనస్ఫూర్తిగా నచ్చింది మీ సంప్రదాయం మాకు నచ్చింది మంచిరోజు చూసుకుని ముహూర్తము పెట్టుకుందాం"!

"చూసేరా... పూర్తిగా ఉత్తరం చదవకుండా అనవసరంగా ప్రక్కవాళ్లని ఆడిపోసుకున్నారు?" అంది జలజనయనం గారి ఇల్లాలు.

"నిజమేనే! బుద్ధి పొరపాటు" అని లెంపలు వాయించుకున్నారు జలజనయనం గారు. "మీరు చాలా మంచివాళ్ళు అని సూటిగా ఒక ముక్క రాయకుండా, దుష్టులు దుర్మార్గులూ కారు అంటూ అదేం రాత?"

"మనక్కాబోయే వియ్యంకుడుగారు రచయితటండీ! రచయితల రాత అలాగే ఉంటుంది. సూటిగా చెప్పేస్తే రచయిత ఎలాఅవుతాడు?" అంది భార్యామణి.

మర్నాడు కొళాయి దగ్గర "మీరే ముందు నీళ్లు పట్టుకోండి. వొదిన గారూ!" అంది జలజనయనం భార్య.

"వద్దండీ! మీరు ఇంటి యజమానులు. మీ తర్వాతే మేము?"

"ఫర్వాలేదు చెల్లమ్మా! మీరే ముందు పట్టుకోండి. అమ్మాయిని చూడ్డానికొచ్చిన మీ స్నేహితులకు మా కుటుంబ సంప్రదాయం చాలా మంచిదని మీరు చెప్పినట్లు ఉత్తరం రాసేరు. అమ్మాయి వాళ్లందరికీ నచ్చిందట కూడా! మంచిరోజు చూసి ముహూర్తాలు పెట్టేయమన్నారు. నువ్వు చిన్నదానివైనా మనస్సు చాలా పెద్దది! మీ ఉభయుల్నీ తప్పుగా అర్థం చేసుకున్నందుకు క్షమించు చెల్లెమ్మా!" అన్నారు జలజనయనం గారు సజలనయనాలతో.

10-11-2002

ఆదివారం ఆంధ్రప్రభ